# కథ

# మానవ సంబంధాలు

-వాలి హిరణ్మయీదేవి

**"మా వాడికి ప్రమోషన్ వచ్చిందట. నిన్న నాకీ రెడీమేడ్‌వి మా ఆవిడకో పట్టుచీరా తెచ్చిచ్చాడు. నాకివి బాగా నప్పాయా?" తను వేసుకున్న డ్రెస్ వంక మురిపెంగా చూసుకుంటూ అడిగాడు రామారావ్, తన స్నేహితులైన వెంకట్రావు సుబ్బారావులతో.**

''చాలా బావున్నాయ్'' అన్నారిద్దరూ ఒకేసారి.

''మా వాడికి ప్రమోషన్ వచ్చి బెంగుళూరుకి ట్రాన్స్‌ఫరయినా మమ్మల్ని వదిలి వెళ్లలేక ప్రమోషనే వద్దనుకున్నాడు. అక్కడకి నేనూ వాళ్లమ్మా ఎంతో నచ్చజెప్పాం. మా కోసం నీ ఫ్యూచర్‌ని పాడుచేసుకోవద్దని. వాడు కాస్త మెత్తబడ్డా మా కోడలు మమ్మల్ని వదిలి వెళ్లడం తన వల్ల కాదని ఖండితంగా చెప్పింది. గొప్ప కాదు గానీ కోడలులా గాక కూతురులా ప్రవర్తిస్తుంది. మమ్మల్ని సొంత తల్లిదండ్రులకన్నా ఎక్కువగా చూసుకుంటుంది. ఇక మా మనవల సంగతి చెప్పనే వద్దు. మా మనవడికి నా దగ్గర, మా మనవరాలికి పార్వతి దగ్గరా పడుకోవడం అలవాటు కదా. మమ్మల్ని వదిలి వెళ్లేది లేదని ఖండితంగా చెప్పారు'' అన్నాడు వెంకట్రావ్. అతను చెప్పే దాంట్లో ఏ అతిశయోక్తి లేకపోవడం తెలిసిందే కాబట్టి రామారావ్, సుబ్బారావు ఆనందంగా నవ్వారు. రిటైరయిన ఆ ముగ్గురికీ అలా సాయంకాలం వేళలో గార్డెన్‌లో కలుసుకొని చీకటి పడేంతవరకూ పిచ్చాపాటి మాట్లాడుకొని ఎవరిళ్లకు వాళ్లు వెళ్లడం ఈ రెండేళ్లుగా అలవాటు. అక్కడ మాట్లాడుకున్నవన్నీ పగలు వాళ్ల భార్యలకు చెబుతూ టైమ్‌పాస్ చేస్తుంటారు. అలా ఆ ముగ్గురిళ్లల్లోని సంగతులు ఎప్పటికప్పుడే వాళ్లందరికీ తెలుస్తూంటాయ్. వాళ్లంతా మంచి ఫామిలీ ఫ్రెండ్స్. ఎవరిళ్లలో శుభకార్యం జరిగినా మరొకరు వెళ్లి తలా ఓ చెయ్యి వేసి, నిర్విఘ్నంగా ఆ కార్యాలను గట్టెక్కిస్తుంటారు. ఇంకొకరి సహాయం తీసుకోకుండా 'మంచి స్నేహానికి' ఆదర్శంగా వీళ్లనే చెప్పుకొంటారు తెలిసిన వాళ్లు.

ఆ మరునాడు సుబ్బారావ్, తన భార్య సుబ్బలక్ష్మితో ఆ సంగతే చెబుతూ, ''పిల్లలుండటమేకాదు వాళ్లు ప్రయోజకులైతే ఆ తల్లిదండ్రులకెంత ఆనందం కదూ. ఆ ఆనందానికి భగవంతుడు మనలనెందుకు దూరం చేశాడో అర్థం కాదు'' అన్నాడు నిట్టూరుస్తూ.

''పోనీలెండి. ఆ పిల్లల్నే మన పిల్లలుగా భావిస్తున్నాంగా. ఇంకెందుకు బాధ'' అంది సుబ్బలక్ష్మి తన లోని బాధను కనిపించనీయకుండా.

''నిజమే గానీ ఎందుకో అప్పుడప్పుడు ఈ బాధ కాస్త ముల్లులా పొడుస్తూ ఉంటుంది'' అన్నాడు సుబ్బారావు.

''అన్నట్లు వెంకట్రావన్నయ్య రెండో కోడలు మళ్లీ నీళ్లోసుకుంది. చింతకాయ పచ్చడి పంపమని అడిగింది. సాయంత్రం మీరు కలుసుకున్నప్పుడు ఇచ్చేస్తారా- హార్లిక్స్ సీసాలో నింపి పెట్టానది'' అంది సుబ్బలక్ష్మి.

''సాయంత్రం వరకూ ఎందుకు? వంటయిపోయిందిగా. భోంచేసి మనిద్దరం వెడదాం. సండే కదా అందరూ ఇంట్లోనే ఉంటారు. సాయంత్రం వరకూ సరదాగా గడిపి రావొచ్చుగా. నీకూ మనసుకు ఉల్లాసంగా ఉంటుంది'' అన్నాడు సుబ్బారావ్.

''నిజమే, భోంచేసి వెడదాం'' అంటూ వంటింటిలోకి నడిచింది సుబ్బలక్ష్మి.

★ ★ ★

''ఏంటోయ్ రామారావ్ అలా డల్‌గా కనిపిస్తున్నావ్? ఆరోగ్యం సరిగ్గా లేదా'' నిశితంగా అతడినే చూస్తూ అడిగాడు వెంకటరావ్.

''ఇవాళే కాదు ఈ వారం రోజులుగా దేనికో మథనపడుతున్నట్లుగా కనిపిస్తున్నాడు. మన నుండి ఏదో దాస్తున్నట్లున్నాడు. చెబితే మనమూ ఏదో పరిష్కారం చూపిస్తాం గదా'' సాలోచనగా అన్నాడు సుబ్బారావు.

''ఏమీ లేదు సుబ్బారావు. మానవ సంబంధాలన్నీ మామూలు ఆర్థిక సంబంధాలే అని మా వాళ్లు నిరూపిస్తోంటే మనసంతా బాధగా ఉంటోంది'' అన్నాడు భారంగా రామారావ్.

''ఏమైందయ్యా రామం. పిల్లలేమన్నా అన్నారా? మాకు చెబితే విషయం అర్థమవుతుంది. వాళ్లని మందలించడానికి వీలవుతుంది కదా'' అన్నాడు వెంకట్రావ్.

''హుం- పిల్లలు - మీరు మందలిస్తే వినే స్టేజి దాటిపోయారు. పెద్దవాడికి ప్రమోషన్ వచ్చి వెళ్లకపోతే అదంతా మామీదున్న ప్రేమ వల్లే అనుకున్నాను. కానీ ఇంటిని, ఇక్కడి పొలాలమీద రాబడిని కోల్పోతానేమోనన్న భయంతో వెళ్లలేదని తెలిసింది. ఆస్తి పంపకాలు చేయమని మా కోడళ్ల తల్లిదండ్రులొచ్చి అడిగితే మిన్ను విరిగి మీద పడినట్లనిపించింది. వీళ్లు అదేదో డైరెక్ట్‌గా నన్నడిగినా బావుండేది. వాళ్లతో అడిగించడం చెప్పించడం మరింత బాధ కలిగిస్తోంది'' అన్నాడు రామారావ్.

''రవితేజా-చంద్రతేజా ఏమంటున్నారు? వాళ్ల ప్లాన్స్ ఏంటో చెప్పారా మరి'' ఆలోచిస్తూ అడిగాడు సుబ్బారావు.

''పెద్దాడేమో బెంగుళూర్లో ఫ్లాట్ కొంటాడట. లేకుంటే అక్కడి అద్దెలు భరించలేడట. చిన్నాడేమో ఈ ప్రైవేట్ ఉద్యోగాలు ఇక నా వల్ల కాదు. ఏదైనా బిజినెస్ చేస్తాను అంటున్నాడు. నీకు తెలుసుగా మా వాడిని గానీ మా మనవల్ని గానీ వదిలి మేమిద్దరం ఉండలేము. ఇక చిన్నవాడి సంగతి తెలుసుగా. ఆలోచించే శక్తి లేదు. ముక్కుమీదే ఉంటుంది కోపం. ఇంతకుముందోసారి బిజినెస్ అంటూ మూడు లక్షలు నష్టం చేశాడు. అందుకే చిన్నదో పెద్దదో ఉద్యోగం చేస్తేనే నయం. ఆ ఆస్తిని మన వలకందజేసేంతవరకూ ఉంటుందని నా ఆశ. లేకుంటే ఇప్పుడే ముక్కలూ చెక్కలయిపోతుంది'' వేదనగా అన్నాడు రామారావ్.

మరో పదేళ్లు ఒక్కసారిగా పడినట్లయినా అతని వంక విచారంగా చూస్తూ ''మీకున్నది మంచి ఆలోచనే. కానీ పిల్లలు అర్థం చేసుకోకుండా ఇంట్లో గొడవలు లేవదీస్తే మీ ఇద్దరికి మనశ్శాంతి ఉండదిక. కలిసున్నంతకాలం ఫర్వాలేదు గానీ పొరపొచ్చాలొస్తే ఇక ఇంట్లో ప్రతీ చిన్న విషయానికి ఎలాటి గొడవలొస్తాయో మనకి వేరేవారి అనుభవాల ద్వారా తెలిసిందే కదా. ఆ ఆస్తి పంపకాలేవో చేసి 'కృష్ణా రామా' అనుకుంటే బావుంటుంది. కానీ నీ స్నేహితుడిగా ఓ సలహా. మీ ఇద్దరికీ కొంత కేటాయించుకోండి ఎవరి మీదా ఆధారపడకుండా. మిగతాదే పిల్లలకు పంచు. ఇక ఎవరి అదృష్టం వారిది'' అన్నాడు వెంకట్రావ్.

''అలా గాకుండా మీ తదనంతరం వాళ్లకి ఆస్తి చెందేలా వీలునామా రాస్తానని చెబితే బావుంటుందేమోగా'' అన్నాడు సుబ్బారావ్.

''ఆ.. అదే మాట నేనంటే వాళ్లెంత మాటన్నారో తెలుసా'' గొంతు పూడుకుపోతుండగా అన్నాడు రామారావ్.

''ఏమన్నారేంటి?'' అడిగాడు వెంకట్రావ్.

''మీరెప్పుడు పోతారో? అప్పటివరకూ ఆగేలా లేవు మా పరిస్థితులు అన్నారు. అంటే మేమిప్పటికిప్పుడు 'హరీ'మంటే బావుండునని ఉంది


వాళ్లకి'' అన్నాడు రామా రావ్, చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ.

''ఛ.. బాధపడకు. మేమిద్దరం వాళ్లకి నచ్చజెబుతాంలే'' అన్నాడు వెంకట్రావు.

''ఏంటో ఈ వయసులో ప్రశాంతంగా ఉండనీయకుండా సమస్యలని లేవదీశారీ పిల్లలు'' అన్నాడు సుబ్బారావు.

'నయం. ఇలాంటి ఆర్థిక లావాదేవీలేవీ లేవు. బాగా ఆస్తిపాస్తులుంటే నేనూ ఇలాగే బాధపడవలసి వచ్చేదేమో' అనుకున్నాడు వెంకట్రావ్ మనసులో.

కానీ వేరే విధంగా బాధపడవలసి వస్తుందని, అతనికా క్షణంలో తెలీదు.



★ ★ ★

ఆ రోజు వెంకట్రావ్ పుట్టిన రోజు. ఉగాది నాడే పుట్టాడు. వెంకట్రావు లేవగానే కొడుకూ, కోడళ్లు, కూతురు, అల్లుడు, మనవలూ శుభాకాంక్షలు చెప్పేసరికి చాలా ఆనందంగా, తృప్తిగా ఫీలయ్యాడు వెంకట్రావ్.

''అబ్బో ఆనందమంతా మీ ముఖంలోనే తాండవిస్తోంది. స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకొందురుగానీ, రండి తలంటుతాను'' అంటూ నవ్వుతూ పిలిచిందతని భార్య పార్వతి.

కుంకుడుకాయ రసంతో తలంటాక, వీపు రుద్దబోతూ ఆగి ''ఏంటండీ వంటి నిండా ఈ దద్దుర్లు'' అంటూ ఆదుర్దాగా అడిగింది.

''పైత్యం చేసి ఉంటుంది. కాస్త అల్లం, జీలకర్రా నూరి రసం తీసివ్వు. తాగితే అవే పోతాయ్'' అన్నాడు వెంకట్రావ్ తేలిగ్గా.

''ఏంటో చిర్రున చీది ఎరుగని మీకు, ఈమధ్య ఏదో ఒకటి వస్తూనే ఉంది. ఆమధ్య విరేచనాలు... ఆ తర్వాత అస్తమానూ జ్వరం రావడం, తగ్గడం. ఇప్పుడేమో ఈ దద్దుర్లు. గోపన్నయ్య దగ్గరికెళ్లడమో, ఆయన చెప్పిన మరో డాక్టర్ దగ్గరికెళ్లడమో చేస్తే మంచిది'' అంది పార్వతి భయంగా.

''నీకన్నింటికీ కంగారే. ఏవేవో ఊహించి భయపడుతుంటావ్. నీకన్నా నేనే హెల్దీగా ఉంటాను. ఆ మాట మరువకు'' అంటూ టవల్ అందుకున్నాడు తను.

''ఏం హెల్దీనో. ఈమధ్య మనిద్దరి ఆరోగ్యాలూ అంతంతమాత్రంగానే ఉంటున్నాయ్ అందామె నిట్టూరుస్తూ.

ఆ సాయంకాలం పెద్దకొడుకు కేక్ తెస్తే చిన్నకొడుకు ఫామిలీ ప్యాక్ ఐస్‌క్రీమ్స్ పట్టుకొచ్చాడు. మనసులో మురిపెంగా అనిపించినా ''ఎందుకురా ఈ అనవసరపు ఖర్చులు. నేనేనాడైనా కేక్ కోశానా ఏమన్నానా? ఎందుకు తెచ్చావ్'' అన్నాడు కొడుకుతో.

''మీ మనవడి ఆర్డర్ అది మరి'' అంది కోడలు నవ్వుతూ.

''నీకు కేక్ కోయడం రాకపోతే నేను కట్ చేసిస్తాలే తాతా'' అన్నాడు అభయమిస్తున్నట్లుగా నాలుగేళ్ల మనవడు రాజా.

ఆ మాటలకు అంతా ఫక్కున నవ్వారు.

ఆ నవ్వులను వింటూ 'భగవంతుడా ఇలా ఎప్పుడూ నవ్వులతో పువ్వులతో జీవితం హాయిగా సాగిపోనీ' అనుకొంది పార్వతి. కానీ ఆ మర్నాడే తను భోరున ఏడ్చే సందర్భం వస్తుందని లీలామాత్రంగానైనా అనుకోలేదామె.

ఆ మరునాడు టిఫిన్లు ముగించి కాఫీ తాగుతూ టీవీ ముందు కూర్చున్నారు పార్వతీ, వెంకట్రావు.

ఇంతలో పదేళ్ల వాసూ వచ్చి ''అంకుల్, మా డాక్టర్‌గారు అర్జెంటుగా మిమ్మల్ని రమ్మన్నారు'' అన్నాడు.

''సరేనోయ్, వస్తున్నాను పద'' అన్నాడు వెంకట్రావ్ చెప్పులేసుకుంటూ.

''పన్లో పని. మీ ఆరోగ్యం గురించి అన్నీ వివరంగా చెప్పండి'' అంది పార్వతి.

మరో పది నిముషాలకల్లా డాక్టర్ గోపీ ముందున్నాడు వెంకట్రావ్. అతడిని చూస్తూ డాక్టర్ గోపీనాథ్ పలకరింపుగా నవ్వాడు. కానీ ఆ నవ్వులో జీవం లేదు. అది గమనించి ''ఏంట్రోయ్ డాక్టర్‌వి నువ్వే పేషెంట్‌లా కనిపిస్తున్నావ్'' అన్నాడు వెంకట్రావ్.

వాళ్లిద్దరూ చిన్ననాటి స్నేహితులు కాబట్టి బాగా చనువుగా ఉంటారు.

''నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలిరా'' అన్నాడు గోపి.

''ఎవరినీ ఓ గంటపాటు లోపలికి పంపకు'' అని వాసుకి చెప్పి వెంకట్రావ్‌తో తన గదిలోకి దారి తీశాడు గోపి.

ఆశ్చర్యంగా అతడినే చూస్తూ లోపలికెళ్లి కూర్చుని ''ఏంట్రా గోపీ. అలా నెర్వస్‌గా కనిపిస్తున్నావేంటి?'' అడిగాడు వెంకట్రావ్.

ఎలా చెప్పాలో, కాస్త తికమకపడి ఆఖరుకి చెప్పలేక చెప్పలేక వెంకట్రావ్‌కి 'ఎయిడ్స్' సోకిన విషయం చెప్పాడతను.

''మిన్ను విరిగి మీద పడటమంటే ఏంటో, లక్ష వోల్టేజీల షాక్ ఒక్కసారిగా తగలడం ఏంటో'' అనుభవంలోకి వచ్చింది వెంకట్రావ్‌కది వినగానే.

''ఇది, ఇదెలా సంభవం? నీకు తెలుసుగా, నేనెలాంటి తప్పుడు పనులూ చేయలేదురా'' అన్నాడు పాలిపోయిన మొహంతో.

''అందర్లాగే నువ్వూ ఆలోచిస్తావేంట్రా. నువ్ నిప్పులాంటి వాడివని నాకు తెలీదా? ఇది కేవలం అక్రమసంబంధాల వల్ల మాత్రమే రాదు. రోగమున్న తల్లి ద్వారా, సిరెంజిలు సరైనవి కాక ఒకరికి వాడినవే తిరిగి వాడటం వల్ల. ఆఖరికి క్షవరం చేయించునే దగ్గర. వాళ్లు కక్కుర్తి పడి కొత్త బ్లేడ్ వాడకుండా, ఎయిడ్స్ రోగమున్న వ్యక్తికి వాడిన బ్లేడ్ వాడినప్పుడు, ఖర్మగాలి మన ముఖం మీదెక్కడైనా గాయమున్నా ఎయిడ్స్ అంటుకునే ప్రమాదం ఉంటుంది. బహుశా నువ్ ఏడాదికి రెండు, మూడు సార్లయినా బ్లడ్ డొనేట్ చేస్తుంటావ్‌గా. అప్పుడేమైనా డిస్పోజబుల్ సిరెంజ్ వాడాక వచ్చి ఉండాలి. లేదూ క్షవరం చేయించుకొన్న దగ్గర తేడా వచ్చి ఉండాలి. అంతే'' అన్నాడు గోపీనాథ్.

''భగవంతుడా? ఏమిటీ శిక్ష. అందుకేనా తరచూ సిక్ అవుతున్నాడు? తనకేనా పార్వతికీనా? తనూ సిక్ అవుతోందంటే ఆమెకీ ఎయిడ్స్ అంటుకునే ఉంటుంది'' పైకే అనేశాడు వెంకట్రావ్ కన్నీళ్లు జలజలా రాలుతుండగా.

గోపీనాథ్ దగ్గరగా వచ్చి, స్వాంతన కలిగేలా భుజంమీద చిన్నగా రాస్తూ అతని కన్నీళ్లు తుడిచాడు.

''భయపడకురా ఎయిడ్స్ నివారణకు ఎన్నో రకాల మందులొచ్చాయ్. రెగ్యులర్‌గా వాడితే రోగాన్ని అదుపులోనైతే ఉంచవచ్చు. ముందు మనసులోని అపోహల్ని, భయాల్ని పారద్రోలు. నువ్ ధైర్యంగా ఉంటేనే పార్వతి గూడా ధైర్యంగా ఉంటుంది'' అంటూ ఓ గంట పాటు నచ్చజెప్పాడు గోపీనాథ్.

* * *

''ఏంటండీ అర్థరాత్రయినా నిద్రపోకుండా అలా మెసలుతున్నారు. నాదప్పుడే ఓ నిద్ర కూడా అయిపోయింది. ఎందుకలా ఉన్నారు? అరెరె ఏంటా కన్నీళ్లు'' అంటూ కంగారుపడుతూ అతని తల నిమురుతూ అడిగింది పార్వతి తనూ కన్నీళ్ల పర్యంతమవుతూ.

''నువ్విలా బెంబేలు పడుతూంటే నేనేం చెప్పను?'' దుఃఖాన్ని దిగమింగుతూ అన్నాడు వెంకట్రావ్.

''ఏనాడూ కంటతడి పెట్టని మీరు కన్నీళ్లు పెట్టుకుంటే నేనెలా ధైర్యంగా ఉండగలనండి? ఇంతకూ ఏంటి, ఎందుకలా బాధపడ్డారు'' అంది బేలగా.

ఆమెను మెల్లగా మెంటల్లీ ప్రిపేర్ చేస్తూ అసలు సంగతి చెప్పాడతను. భరించలేక భోరున ఏడ్చేసిందామె. పిల్లవాడు లేచి ఏడిస్తే, అత్తగారి పక్కలో వేద్దామని వచ్చిన పెద్దకోడలు రమణికి వారి మాటలు చెవిన పడ్డాయ్. వారికి ఎయిడ్స్ అన్న వార్త ఆమెను నిలువెల్లా వణికించింది. వళ్లంతా జలదరించింది. వెంటనే తమ గదిలోకి వెళ్లి భర్తను లేపి ఆ సంగతి చెప్పేసింది. అది నిజమని నమ్మడానికి వారికి చాలా కష్టం వేసింది. ఆ మర్నాడు పొద్దుట లేచీ లేవడంతోనే తన తోడికోడలు శారదకూ చెప్పింది. అంతే ముందుజాగ్రత్త చర్యగా పిల్లల్ని వాళ్ల దగ్గరకి వెళ్లనీయలేదు. వంటగదిలోకి పార్వతమ్మని రానీయలేదు. సరేలే నీళ్లయినా పట్టి ఉంచుదామని ఆమె వెళ్లి బిందెల్ని నింపితే, శారదెళ్లి ఆ నీళ్లని వంపి, బిందెల్ని తోమి మళ్లీ నీళ్లు నింపసాగింది. కోడళ్ల ప్రవర్తన, కొడుకుల ముభావం పార్వతీ-వెంకట్రావ్‌లనెంతో బాధ పెట్టింది. తమని వాళ్లు తప్పించుకు తిరగడం వెలివేయటం భరించలేకపోయారు. పార్వతమ్మయితే చాలా తల్లడిల్లింది. ఇక ఆగలేక ఒకానొక బలహీన క్షణంలో ''ఏవండీ మనిద్దరం ఆత్మహత్య చేసుకొందామా'' అని అడిగేసరికి, వెంకట్రావ్ మౌనంగా ఉండలేకపోయాడు. వారం రోజులుగా భరిస్తున్న టార్చర్ కొబట్టి.

ఆ మర్నాడు కొడుకుల్ని,

## చేపల కూర అంటే ఇష్టం!

**తెలుగులో ఇంతకాలం బిజీగా వుంటూ వచ్చిన గ్లామర్‌గాళ్ శ్రియకి ఇప్పుడు తెలుగులో అవకాశాలు కరువయ్యాయి. అయితే బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న ఆమె తెలుగులో వచ్చిన 'అతడు' రీమేక్‌లో బాబీడియోల్ సరసన నటిస్తోంది. అలాగే 'ఆవారా పన్' అనే మరో హిందీ సినిమాలో కిస్సుల స్పెషలిస్టుగా పేరు పొందిన ఇమ్రాన్ హష్మీ సరసన నటిస్తోంది. అఫ్‌కోర్స్ ఈ సినిమాలో మాత్రం ముద్దు సీన్లు వుండవుటలెండి. అన్నట్టు తెలుగులో ఎక్కువగా నటించిన శ్రియకి ఇక్కడి చేపల కూర అంటే మహా ఇష్టంట.**



కోడళ్లని పిలిచి ''మీ అందరితో మాట్లాడాలి. పిల్లల్ని బైటకు పంపేసి రండి హాల్లోకి'' అన్నాడు. వాళ్లలాగే చేసి వచ్చారు. ''పార్వతీ! నువ్ కూడా వచ్చి కూర్చో'' అన్నాడు. మౌనంగా వచ్చి కూర్చుందామె.

''మీకు మాతో కలిసి ఉండాలని లేదు. అంతేనా'' ఖచ్చితంగా సూటిగా అడిగాడు వెంకట్రావ్.

''మా భవిష్యత్తు, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తే మీరు వేరేగా ఉంటేనే బావుంటుందని మా అందరి అభిప్రాయం'' అనేసింది రమణి ఎలాగో ధైర్యం తెచ్చుకొని.

''అంటే మేమిద్దరం విడిగా రూమ్‌లో ఉండి, వండి వార్చుకోవాలా'' అడిగాడు.

''ఎక్కడైనా, దూరంగా ఇల్లు అద్దెకి తీసుకొని ఉంటే బాగుంటుందని..'' శారద మాట కంప్లీట్ కాకముందే, ''అది జరగని పని. ఈ ఇల్లు నా స్వార్జితం. ఒక్కో ఇటుక వెనుక మా వేలవేల చెమట బిందువులున్నాయ్. నా ఇంట్లోంచి మమ్మల్ని వెళ్లిపొమ్మనే హక్కు మీకు లేదు. మాతో కలిసి ఉండాలనుకొనేవాళ్లుండండి. లేదా మీరే ఎక్కడికైనా వెళ్లిపొండి'' ఖండితంగా చెప్పాడు వెంకట్రావ్ ఏదో అనబోతున్న పార్వతిని వారిస్తూ.

''నాన్నా! మీ ఇద్దరికీ ఇంత పెద్ద ఇల్లు ఎందుకు? శారద చెప్పినట్లు ఎక్కడన్నా ఓ రెండు గదుల ఇల్లు చూసుకోవచ్చుగా. మాకైతే ఈ ఇల్లు సరిపోతుంది'' అంటూ నసిగాడు రెండో కొడుకు చంద్రం.

''మేము పనికిరాము గానీ మేము కట్టిన ఈ ఇల్లు పనికివస్తుంది. భేష్.. చెప్పాగా మేమెన్నో త్యాగాలు చేసి పొదుపు చేసి కట్టుకొన్నది మా చివరి రోజుల్లో మాకింత రక్షణ ఇస్తుందని. మా మలిసంధ్యలో ఒకరి కోసం ఒకరుండటానికే దేవుడిలా చేస్తాడేమో. నాకొచ్చే పెన్షన్‌తో మా ఇద్దరి జీవితాలు గడిచిపోతాయ్. ఇద్దరిలో ఎవరం ముందుగా పోయినా ఓ పోర్షన్ అద్దెకిచ్చుకుంటే ఎలాగోలా బతక్కపోము. మీరు మాకు పెట్టే అవసరమూ లేదు. మాతో ఉంటూ, మా సొమ్ము తింటూ ఇలా కాకిమీద పిల్లమీదా పెట్టి మాటలు అనే అవసరం లేదు'' అన్నాడతను తీవ్రంగా.

''చూశారా ఆ పొగరు. నానా తిరుగుళ్లు తిరిగి రోగాలు తెచ్చుకొని మనకింత ఆధారం లేకుండా చేసి ఎంత పొగరుగా పొమ్మంటున్నారో. అంతగా పొమ్మని అంటూంటే ఇంకెందుకు పోదాం పదండి'' అంది రమణి పౌరుషంగా.

దాంతో పార్వతికి ఒళ్లుమండింది. ''చదువూ సంధ్యా లేనిదాన్నయిన నాకే ఆ జబ్బు ఎలా వస్తుందో తెలిసిందే. చదువుకున్న మూర్ఖురాలివి నువ్వు. నానా తిరుగుళ్లు తిరిగితేనే వస్తుందని ఎలా అంటున్నావ్. నీకెంత ధైర్యం మీ మావగారిని పట్టుకొని అంత మాటనడానికి. ఇంకా ఆయనకి నచ్చజెప్పి. మిమ్మల్ని ఎటూ పోనివ్వద్దని బతిమాలాలనుకొన్నాను. కానీ ఇప్పుడు నేనే చెబుతున్నా. తక్షణం మీరంతా బైటకు నడవండి'' అంది ఆవేశంగా.

ఆ మర్నాడు ఎప్పట్లా గార్డెన్‌లో కలుసుకొన్నారా మిత్రత్రయం. తమ ఇంట్లో జరిగిన గొడవంతా చెప్పి ''నా పెంపకం పట్ల నాకెంతో నమ్మకముండేది. అది వమ్ము అయిపోయింది. నేను మా పెద్దలని గౌరవించాను కాబట్టి నా పిల్లలూ అదే బాటలో నడుస్తారని ఆశించిన నాకు ఇది చాలా గట్టి దెబ్బ. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే. అందుకే మన రామారావ్ పిల్లలు ఆస్తి కోసం అతడిని బాధ పెట్టారనుకున్నాను. ఆస్తుల గొడవేం రాదు అనుకుంటే ఆరోగ్యపరంగా మా ఇంట్లో కలతలు వచ్చాయి. ఎయిడ్స్ పేరెంట్స్‌ని అసహ్యించుకోకండి అని ఎన్ని నినాదాలు వినిపిస్తున్నా కొందరి చెవిన పడటమే లేదు అనడానికి, నా కుటుంబ సభ్యులే ఉదాహరణ. మీకూ ఏవైనా అభ్యంతరాలుంటే చెప్పండి- మిమ్మల్ని కలవడమూ మానేస్తాను'' అన్నాడు వెంకట్రావ్.


''ఛ ఎంత మాటన్నావు. నిన్ను అనుమానిస్తే మమ్మల్ని మేము అనుమానించుకొన్నట్లే. డబ్బు ఇప్పుడే ఇవ్వను అన్నందుకు నేను నా పిల్లలకు శత్రువునయ్యాను. వాళ్ల భవిష్యత్తు కోసమేగా నేను రెక్కలుముక్కలు చేసుకొని కూడబెట్టింది. దాన్నర్థం చేసుకోకుండా వాళ్లు ప్రవర్తించబట్టే కదా. ఈ ముసలితనంలో ఆసరాగా నిలబడతారనుకున్నవాళ్లను పంపించిందీ. మన అభిప్రాయాలకు విలువనీయని వాళ్లను వదిలించుకోవడంలోనే ఉంది విజ్ఞత. కాబట్టే నువ్వన్న మాటలకు కోపం తెచ్చుకోవటం లేదు. బతికున్నంత కాలం మనం ఒకరికొకరంగా ఉందాం. ఈ జనరేషన్‌కి మనలను అర్థం చేసుకొని అనురాగం పంచే మనసు లేదు'' అన్నాడు రామారావ్ వేదనగా.

ఇద్దరి మాటలని వింటోన్న సుబ్బారావ్ ''నాకైతే మతిబోతోంది. మీ ఇద్దరినీ చూసినప్పుడల్లా మీలా నాకు పిల్లలు లేరే అని ఎంతో బాధపడేవాడిని. అలాంటిది మీ పిల్లల ప్రవర్తన చూశాక, పిల్లలు లేని నేనే ఎంతో అదృష్టవంతుడిననుకొంటున్నా. ఎవరైనా పిల్లల్ని ఎందుకాశిస్తారు? మనకో దిక్కుగా వాళ్లు నిలబడతారన్న ఆశకొద్దీ. కానీ నేటి పిల్లలు, తల్లిదండ్రుల నుండి కేవలం ఆస్తిపాస్తులనాశించడం తప్ప. వారికి కావల్సిన ఆప్యాయతానురాగాలను పంచివ్వాలనుకోవడం లేదు. ఇలా ఉంటే ఇక కుటుంబ వ్యవస్థ ఎంతోకాలం మనదు'' అన్నాడు ఆవేదనగా.

''అందుకే. మనం ముగ్గురం కలిసి తల్లితండ్రులెలా ఉండాలో పిల్లలూ వారి బాధ్యతలనెలా నిర్వర్తించాలో నవీన పద్ధతులతో తెలీజేద్దాం. మన వంతు బాధ్యతగా సమాజానికి ఈమాత్రం చేస్తే మన జీవితాలకో సార్థకత ఏర్పడుతుంది'' అన్నాడు రామారావ్.

ఆ మాటలతో ఏకీభవించారు మిగిలిన ఇద్దరూ, తమ తమ అనుభవాల వల్ల ఎలాంటి సమస్యలొస్తాయో తెలుసుకున్నారు కాబట్టే. మానవ సంబంధాలను మెరుగుపరచదల్చుకున్నారు.

☆



## గుండు గెటప్‌లో శ్రీకాంత్

**రచయిత పోసాని కృష్ణమురళి దర్శకత్వం వహిస్తున్న 'ఆపరేషన్ దుర్యోధన'లో హీరో శ్రీకాంత్ గుండు గెటప్‌లో కనిపించబోతున్నాడు. అంతే కాదు, ఈ సినిమాలో హీరోయిన్ కల్యాణి అయినప్పటికీ, మరో హీరోయిన్‌గా (వాంప్ తరహా) నటిస్తున్న ముమైత్ ఖాన్‌తోనే ఎక్కువగా రొమాంటిక్ సీన్లలో కనిపిస్తాట్ట. 'ఆపరేషన్ దుర్యోధన' రాజకీయాలు ముఖ్యాంశంగా రూపొందుతున్న సినిమా అని టాలీవుడ్ వార్తలు.**